కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఆత్మకూర్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యపడుతుందని నమ్మి అన్ని పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు గాడి కృష్ణమూర్తితో పాటు డైరెక్టర్లు శుక్రవారం ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి గెలుపు ఖాయమని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర గీతకార్మిక డిపార్ట్‌మెంటు చైర్మన్ కేశం నాగరాజుగౌడ్, నాయకులు రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్‌యాదవ్, నల్గొండ శ్రీనివాసులు, రఫీక్, నాగేష్ తదితరులు ఉన్నారు.

అమరచింత: బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయి ఐదు నెలల కాలం దాటక ముందే మండలంలోని కీలక బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. మండలంలోని చింతరెడ్డిపల్లి, మిట్టనందిమళ్ల, ఈర్లదిన్నె, నందిమళ్ల ఎక్స్‌రోడ్, కిష్టంపల్లి గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీపీ, సింగల్‌విండో డైరెక్టర్లు శుక్రవారం మక్తల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. నర్వమండల మాజీ ఎంపీపీ చుక్క రామలింగమ్మ, రైతు సంఘం మండల అధ్యక్షుడు చుక్క ఆశిరెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు సర్వారెడ్డితో పాటు సుమారు రెండు వందల మంది కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

పార్టీని వీడి నాలుగు రోజుల కిందట

అమరచింత జెడ్పీటీసీ మార్క సరోజ బీఆర్ఎస్ పార్టీని వీడి నాలుగు రోజుల కిందట సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అమరచింత ఎంపీపీ డాక్టర్ చుక్క మాలతి మామ చుక్క ఆశిరెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఎంపీపీ సైతం ఇక కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారని పలువురు అంటున్నారు. అమరచింత, ఆత్మకూర్ మండలాల్లో బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్ పార్టీలో చేర్పించేందుకు టీపీసీసీ కల్లు గీత డిపార్ట్‌మెంట్ రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజ్‌గౌడ్ ప్రత్యేక దృష్టి సారించారు.

కొత్తకోట రూరల్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రావుల కర్ణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరుతున్న వారికి దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదధన్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. త్వరలో జరుగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ

ఆత్మకూర్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని వ్యాపార కేంద్రాల వద్ద శుక్రవారం సిబ్బంది ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విన్యాసాలతో వివరించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ప్రజలు ప్రమాదాల బారిన పడ్డప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం వారోత్సవాల కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది సంజీవరెడ్డి, రాముడు, సందీప్‌రెడ్డి, భానుచందర్‌రెడ్డి, వెంకటనర్సయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు అందిస్తున్న ఫైర్ సిబ్బంది

నర్సింగాపురం వాసికి డాక్టరేట్

మదనాపురం: మండలంలోని నర్సింగాపురం గ్రామానికి చెందిన బక్షి రవీందర్‌రావు శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయన జంతు శాస్త్ర సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్నారు. జంతు శాస్త్రంలో ఐసీఎమ్మార్ శాస్త్రవేత్త డాక్టర్ డి రఘునాథరావు పర్యవేక్షణలో 'ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు యొక్క ఎగువ, దిగువన గల రిజర్వాయర్లలో తిలాపియ చేప, మిగతా పెంపక చేపలపై కలిగించే ప్రభావం' గురించి చేసిన అధ్యయనానికి ఉస్మానియా యూనివర్సిటీ పీహెడీ పట్టాను ప్రదానం చేసింది. 26 ఏళ్లుగా వివిధ హోదాల్లో విద్యాబోధన కొనసాగిస్తున్న ఆయన వివిధ పత్రికల్లో 10 పరిశోధన వ్యాసాలను ప్రచురించారు. కృష్ణానదిలో వివిధ రకాల చేపల వైవిధ్యం, దక్షిణాసియా దేశాలలో నివసించే అస్థి చేపల గురించి గ్రంథాలను ముద్రించారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గజ్జల నాగన్న, మాజీ ఎంపీపీ మహదేవన్‌గౌడ్, సింగిల్ విండో మాజీ చైర్మన్ గిన్నె శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు మాజీ అధ్యక్షుడు హనుమాన్‌రావు, మన్నెం కొండ పూలమాల, శాలువాతో సన్మానించారు.



రవీందర్‌రావును సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

క్లుప్తంగా

నీటి వృథాను అరికట్టండి



పాన్‌గల్: ఎండల తీవ్రతతో బోరు బావుల్లో భూగర్భ జలాలు అడుగంటి నీటి ఇబ్బందులు ఏర్పడుతున్న తరుణంలో నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు చెబుతున్నా.. కొన్ని గ్రామాల్లో నీటి వృథా అవుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని బుసిరెడ్డిపల్లిలో పలు కాలనీల్లో నల్లాలకు ఆన్‌ఆఫ్ లేక నీరు వృథా అవుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నల్లాలకు ఆన్‌ఆఫ్ ఏర్పాటు చేసి నీటి వృథాను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బెల్టుషాపుపై దాడి: కేసు నమోదు



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో శుక్రవారం తెలుగు ఈశ్వరయ్య ఇంట్లో మద్యం అమ్ముతున్నాడని సమాచారం మేరకు ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బెల్టుషాపుపై దాడి చేశారు. ఈ తనిఖీల్లో 9 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ దాదాపు రూ.5,365 ఉంటుదని పోలీసులు తెలిపారు. షాపు యజమాని తెలుగు ఈశ్వరయ్యపై కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



వీపనగండ్ల: మండల కేంద్రానికి సమీపంలో వెలగొండ గ్రామానికి చెందిన సాయిలు బైకుపై వెళ్తూ అదుపు తప్పి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆయన వీపనగండ్ల నుంచి సొంతూరు వెలగొండకు వెళ్తుండగా శుక్రవారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. తీవ్ర గాయాలకు గురైన ఇతడిని చిన్నంబావి పోలీసు వాహనంలో కొల్లాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మరుగుదొడ్లు నిర్మించండి



ఆత్మకూర్: మున్సిపాలిటీకి నాలుగు దిక్కుల మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాలని కోరుతూ చైర్‌పర్సన్ గాయత్రి, కమిషనర్ నాగరాజుకు సీపీఐ మండల నాయకులు వినతి పత్రం శుక్రవారం అందించారు. కొత్తకోట రోడ్డు వైపు, అమరచింత వైపు, పాత పంచాయతీ, ప్రభుత్వ ఆస్పత్రి, మటన్ మార్కెట్ దారిలో ప్రతి నిత్యం వేలాది సంఖ్యలో ప్రయాణికులు వస్తుంటారని తెలిపారు. ప్రజల, ప్రయాణికుల అవసరాల నిమిత్తం తక్షణమే మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీహరి, రాబర్ట్, మోష, సీఎస్ శెట్టి, లింగన్న, బాలరాజు తదితరులు ఉన్నారు.

కవర్ కట్టిన మామిడికి డిమాండ్

పెద్దకొత్తపల్లి: మామిడి తోటలో కాయలకు పాలిథిన్ కవర్‌లు కట్టడం వలన ఎలాంటి చీడపీడలు లేకుండా మామిడి కాయలు పుష్టిగా పెరగడంతో ధర రికార్డు స్థాయిలో పలుకుతోంది. క్వింటాలుకు రూ.1.10 లక్షల వరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. సాధారణంగా పండించే మామిడి కాయలకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు పలుకుతోంది. కవర్‌లు కట్టినవాటికి ధర ఎక్కువగా ఉండడంతో రైతులు కవర్‌లు కట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది మండల కేంద్రంలో రైతు ఎల్లస్వామి మామిడి తోటలకు కవర్లు కట్టడంతో రికార్డు స్థాయిలో ధర లభించడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.

రోడ్ల మధ్యన స్తంభాలు తొలగించాలి



పెద్దకొత్తపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో రోడ్ల మధ్యన విద్యుత్ స్తంభాలు దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. దేవల్‌తిరుమలాపూర్, దేవినేనిపల్లి, పెద్దకార్పాముల, కల్వకోల్ గ్రామాల్లో సీసీ రోడ్ల మధ్యమే స్తంభాలు ఉండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. విద్యుత్ అధికారులు పట్టించుకొని రోడ్ల మధ్యన ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

వీపనగండ్ల: ఉపాధి కూలీలు తమ ప్రాణాలు పణంగా పెట్టి 44 డిగ్రీల ఉష్ణోగ్రతలో పనులు చేస్తున్నా వారికి సకాలంలో కూలి డబ్బులు ఇవ్వడం లేదని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఆంజనేయులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన సంగినేనిపల్లిలో ఉపాధి పనులు చేస్తున్న ప్రదేశాన్ని సందర్శించి కూలీలతో మాట్లాడారు. కూలీలకు ఇవ్వాల్సిన వేసవి అలవెన్స్‌ను ఇవ్వకపోగా గంపలు, పార, గడ్డపారలకు అవసరమైన డబ్బులు, రవాణా చార్జీలు చెల్లించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. ఉపాధి కూలీల గ్రూపులకు మేటీలను ఏర్పాటు చేసి కమీషన్‌లు తీస్తుండడంతో కూలీలు నష్టపోవాల్సి వస్తుందని ఆరోపించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి రోజు కూలీలకు రూ.600 చెల్లించాల్సి ఉండగా అందులో సగం డబ్బులు కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించకుంటే తమ సంఘం నుంచి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జంగవీరయ్య, వెంకటయ్య పలువురు మహిళా కూలీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆంజనేయులు

కేతేపల్లి విద్యార్థినికి రాష్ట్రస్థాయి బహుమతి




విద్యార్థికి నగదు, ప్రశంసాపత్రం అందిస్తున్న లీడ్ బ్యాంక్ మేనేజర్, హెచ్‌ఎం

పాన్‌గల్: లీడ్ బ్యాంక్ వనపర్తి వారు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలో మండలంలోని కేతేపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని నందినికి రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి లభించినట్లు పాఠశాల హెచ్‌ఎం రవి తెలిపారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ ఏఎన్ పవార్ పాఠశాలను సందర్శించి ప్రథమ బహుమతి కింద రూ. 4 వేలు నగదు, ప్రశంస పత్రాన్ని విద్యార్థిని నందినికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఫైనాన్సియల్ లిటరసీ' అనే అంశంపై విద్యార్థిని ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి లభించడం అభినందించదగిన విషయమన్నారు. విద్యార్థులు బ్యాంకు ఖాతాను ఉపయోగిస్తున్నప్పుడు సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏటీఎం కార్డు ఉపయోగించే విధానం, డిజిటల్ లావాదేవీలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఏఎంఓ మహనంది అన్నారు. జీవితంలో ప్రతి ఒక్కరికీ ఆర్థిక క్రమశిక్షణ చాలా ముఖ్యమైనది ఎంపీడీఓ కోటేశ్వర్ విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మంచి ప్రతిభ కనబరుస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తూ పాఠశాలకు, గ్రామానికి పేరు తీసుకవస్తున్నారని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల క్రమశిక్షణ, పట్టుదలతో మంచి ఫలితాలు సాధిస్తున్నారని పాఠశాల హెచ్‌ఎం రవి అన్నారు. విద్యార్థిని ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు అభినందించారు.

'జీఓ 1334 రద్దు చేయాలి'

పెబ్బేరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం 3 ఏప్రిల్ 2024న విడుదల చేసిన మెమో 1334 ఉపసంహరించుకోవాలని శుక్రవారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలోని ఏఓ భానుప్రకాష్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీబాయికి వేరువేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ 2023 సెప్టెంబర్ 11 నుంచి అక్టోబర్ 4 వరకు రాష్ట్రంలో 24 రోజులు సమ్మె చేశామని, ఆ కాలంలో గత ప్రభుత్వ మంత్రులు, అధికారులు చర్చించి టీచర్లకు రూ.రెండు లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష పదవీ విరమణ బెనిఫిట్ ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి నారాయణమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు కవిత, వనపర్తి ప్రాజెక్టు అధ్యక్షులు జ్యోతి పాల్గొన్నారు.



ఏఓ భానుప్రకాష్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

రేషన్ బియ్యం పట్టివేత

కోడేరు: అక్రమంగా ఆటోలో రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుబడిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ కురుమూర్తి వివరాల ప్రకారం మండల కేంద్రం నుంచి వనపర్తి జిల్లా గోపాల్‌పేటకు చెందిన ఆటో డ్రైవర్ దేవరాజు లబ్ధిదారుల నుంచి ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యం కొనుగోలు చేసి బియ్యాన్ని ఆటోలో తరలిస్తున్నాడు. పోలీసుల తనిఖీల్లో వాహనం పట్టుబడగా రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు



తిర్మాలాయపల్లిలో కొనుగోలు కేంద్రం పరిశీలిస్తున్న తహసీల్దార్ అబ్రహంలింకన్



కంభాళాపురంలో..

మదనాపురం: మండలంలోని తిర్మలయపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం తహసీల్దార్ అబ్రహం లింకన్ పరిశీలించారు. రెండు రోజులుగా ఆకాశం మేఘావృతం అవుతుందని, వర్ష పడే సూచనలు కనిపిస్తుండడంతో వర్షాలకు ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లు కప్పి ఉంచుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రవ వద్ద రైతులకు తాగునీరు ఏర్పాటు చేయాలని చెప్పారు. రైతులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని నిర్వాహకులకు హెచ్చరించారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకేపీ అధికారులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ధాన్యంతో పాటు కొనుగోలు కేంద్రాలకు కావాల్సిన అన్ని రకాల ధృవపత్రాలు తీసుకొస్తే.. వారికి చెల్లించాల్సిన ధాన్యం డబ్బులను బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని తెలిపారు.

లక్ష్మీనరసింహ యోగానంద స్వామి ఉత్సవాలు



ఖిల్లాఘనపురం: మండలంలోని సోళీపురంలో వెలిసిన శ్రీమత్ దత్తాత్రేయ పీఠ సంవర్ధిత శ్రీరామ అవధూత శ్రీలక్ష్మీనరసింహ యోగానంద స్వామి 125వ ఆరాధన సహిత సప్తాహ మహోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం గణపతిపూజతో స్వామి వారి ఉత్సవాలను పండితులు ప్రారంభించారు. పుణ్యాహవాచనం, రక్షబంధనం, రుత్విగ్వరణం, అభిషేకం, రుద్ర, చండీ తదితర హోమాలను నిర్వహించారు. సాయంత్రం కుంకుమార్చన చేశారు. రాత్రికి లక్షదీపోత్సవ కార్యక్రమాలను నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. స్వామి వారి 125వ ఆరాధనోత్సవాలతో పాటుగా జానకమ్మ వారి 81వ ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని లక్షదీపోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు స్వామివారి పూజా కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహకులు చెప్పారు.

ఆపరేటర్‌ను నియమించాలి

కోడేరు: సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కామన్ సర్వీస్ సెంటర్‌కు ఆపరేటర్‌ను నియమించాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు. దాదాపు నాలుగు నెలల కిందట ప్రారంభించిన సెంటర్‌కు ఆపరేటర్‌ను నియమించకపోవడంతో మూసివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 12 రకాల డిజిటల్ సేవలు అందుబాటులో ఉన్న ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

ఖిల్లాఘనపురం: వనపర్తి జిల్లాలో భారతీయ జనతాపార్టీ బలోపేతం చేయడానికి కృషి చేస్తామని బీజేపీ పంచాయతీరాజ్ సెల్ జిల్లా కన్వీనర్ విప్పటూరి విక్రం అన్నారు. శుక్రవారం ఆయనను పంచాయతీరాజ్ సెల్ జిల్లా కన్వీనర్‌గా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు నారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పురుషోత్తం నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు విక్రం సుదీర్ఘ రాజకీయ అనుభవాన్ని పార్టీ బలోపేతానికి ఉపయోగించాలని సూచించారు. విక్రం మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన జిల్లా అధ్యక్షుడి నమ్మకాన్ని నిలబెడతానన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మూడో సారి ప్రధానమంత్రిని చేసేందుకు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, మండల కన్వీనర్ బుచ్చిబాబుగౌడ్, ఉపాధ్యక్షులు కొరిగెల గోపి, చిట్యాల రాంచంద్రయ్య పాల్గొన్నారు.



నియామక పత్రం అందుకుంటున్న విక్రం

ప్రమాద బాధితులకు పరామర్శ

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగరాల గ్రామానికి చెందిన మాల శేఖర్, బాబు అన్నదమ్ములు కలిసి గురువారం బైక్‌పై పెబ్బేరుకు వెళ్తుండగా.. శ్రీరంగాపురం శివారులో బైక్ అదుపు తప్పడంతో కిందపడి గాయాలయ్యాయి. స్థానికులు వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. బాధితులను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్‌యాదవ్ ఆస్పత్రిలో పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం ఆస్పత్రిని పరిశీలించారు. రోగుల పరీక్షల కోసం తెచ్చిన సీబీసీ మిషన్ పని తీరు గురించి డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి పరిసరాలను రోజు గ్రామ పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శి నందకిషోర్‌కు సూచించారు. కార్యక్రమంలో రాంచందర్, బహుజన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో..

పెబ్బేరు రూరల్: పెబ్బేరు మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన బూరమోని శేఖర్ గురువారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆస్పత్రిలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందించారు. చిన్నారెడ్డి వెంట కొండారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బాధితుడిని పరామర్శిస్తున్న రాజేందర్‌యాదవ్

మొక్కల సంరక్షణపై దృష్టి సారించండి

అమరచింత: హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని నందిమళ్లలో చెట్టు చెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొక్కలకు నీరు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రధాన రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలు అగ్నికి ఆహుతి కాకుండా మొక్కల ప్రదేశంలో చెత్తచెదారం ఉంటే వాటిని తొలగించాలని సూచించారు. మొక్కలకు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని అందించాలని ఆదేశించారు. ప్రార్థన మందిరాలు, దేవాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల ఆవరణంలో నాటిక మొక్కలు ఎండుముఖం పట్టకుండా వాటిని కాపాడాల్సిన అవసరం ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ నరసింహులు, ఈసీ రఘు తదితరులు పాల్గొన్నారు.



వెంగళాయిపల్లిలో చెట్లకు నీరు పడుతున్న ఏపీఓ కుర్మయ్య



నందిమళ్లలో..

మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

పాన్‌గల్: హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు ఎండకుండా క్రమం తప్పకుండా వాటరింగ్ చేయాలని ఏపీఓ కుర్మయ్య అన్నారు. శుక్రవారం చెట్టు, చెట్టుకు నీరు కార్యక్రమంలో భాగంగా వెంగళాయిపల్లిలో పర్యటించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొక్కలకు నీరు పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల్లో మొక్కలు ఎండకుండా నీరు పట్టడం, నీడ ఏర్పాటు చేయడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం మండలంలోని అన్నారంతండాలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. వేసవి కాలం దృష్ట్యా కూలీలు ఉదయం పూట తొందరగా పనులకు రావాలన్నారు. పనుల వద్ద కూలీలకు ఇబ్బందులు కలుగకుండా నీడ, తాగునీరు వంటి వసతులు తప్పక ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచాలని, రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సిబ్బందికి సూచించారు.

కనులపండువగా కోటమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ

ఖిల్లాఘనపురం: మండలంలోని పర్వతాపురం గ్రామంలో శుక్రవారం కోటమైసమ్మ దేవత విగ్రహ ప్రతిష్టా మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయం వద్ద గురువారం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ఉదయం నుంచి దీక్ష, రక్షా, వాంతి తదితర హోమాలు నిర్వహించిన పండితులు 10:35 గంటలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా తయారు చేసిన బోనంలో అమ్మవారి కోసం ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాన్ని తీసుకుని మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయం చేరుకొని మొక్కులు సమర్పించారు. శుక్రవారం మండలానికి వచ్చిన ఎమ్మెల్యే మేఘారెడ్డి అమ్మవారి పూజా కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు.



పర్వతాపురంలో కోటమైసమ్మకు బోనాలు సమర్పిస్తున్న మహిళలు

బెల్టు దుకాణాలను తొలగించాలని వినతి

కోడేరు: మండలంలో బెల్టు దుకాణాలు తొలగించాలని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ జయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి శివ శంకర్ మాట్లాడుతూ గ్రామాల్లో విచ్చలవిడిగా సారా, మద్యం విక్రయిస్తున్నారని వివరించారు. దీంతో యువత మద్యానికి బానిస అయ్యి అనారోగ్యాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో వరప్రసాద్, శ్రీశైలం, రాము, కార్తీక్, వెంకట్‌రెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.